క్లుప్తంగా

వెంకన్న ఆలయానికి రూ.20 వేల విరాళం



ఆలయ చైర్‌పర్సన్ వీరీతాదేవికి విరాళాన్ని అందజేస్తున్న దాత గంగాభవాని

అమలాపురం టౌన్: స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు పట్టణంలోని గారపాటివీధికి చెందిన తిక్కిరెడ్డి గంగా భవాని రూ.20 వేల విరాళం సమకూర్చారు. ఈ మొత్తానికి సంబంధించిన చెక్‌ను ఆలయ చైర్‌పర్సన్ దూడల వెంకట వీరీతాదేవికి శనివారం అందజేశారు. దాతకు స్వామి వారి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని చైర్‌పర్సన్ వీరీతాదేవి అందించారు. కార్యక్రమంలో పట్టణ వైఎస్సార్‌సీపీ యువజన కమిటీ అధ్యక్షుడు దూడల ఫణి తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీఎస్పీ అంబికా ప్రసాద్ తదితరులు

అమలాపురం టౌన్: స్థానిక డీఎస్పీ కార్యాలయం ఎదురుగా మెయిన్ రోడ్డు వద్ద అమలాపురం చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో మజ్జిగ చలి వేంద్రం శనివారం ఏర్పాటైంది. డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్ చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో చాంబర్ అధ్యక్షుడు బోణం సత్య వరప్రసాద్, కార్యదర్శి కొమ్మూరి వెంకటాచల ప్రసాద్, కోశాధికారి దొమ్మేటి సాయిబాబు, ముఖ్య సలహాదారు నల్లా పవన్‌కుమార్, రేకపల్లి సూరిబాబు, ఉపాధ్యక్షుడు మోకా వెంకట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

బాలిక వైద్యానికి రూ.20 వేల అందజేత



చిన్నారి తల్లిదండ్రులకు ఆర్థిక సాయం అందజేస్తున్న యువకులు

తాళ్లరేవు: ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతున్న కోరంగి పంచాయతీ సీతారామపురం గ్రామానికి చెందిన రెండున్నరేళ్ల బాలిక పంపన ఉజ్వలకు వైద్య ఖర్చుల నిమిత్తం తాళ్లరేవు, సీతారామపురం గ్రామాలకు చెందిన యువకులు రూ.15 వేలు ఆర్థిక సాయం అందజేశారు. శనివారం సీతారామపురంలో బాలిక తల్లిదండ్రులు పంపన రామకృష్ణ, లలితలకు నగదును స్వయంగా వెళ్లి అందజేశారు. స్థానిక బంగారం దుకాణం యజమాని మందారపు సత్తిబాబు రూ.5 వేలు ఆర్థిక సాయం చేశారు.

బాధితునికి రూ.15 వేల ఆర్థిక వితరణ



గొల్లవిల్లిలో బాధితునికి చెక్కును అందిస్తున్న రమణారావు

ఉప్పలగుప్తం: ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదంలో కాలికి తీవ్ర గాయమైన మండలంలోని గొల్లవిల్లి గ్రామానికి చెందిన దేవరపల్లి బాబూరావుకు మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కుంచే రమణారావు శనివారం రూ.15 వేలు ఆర్థిక సాయం అందించారు. రమణారావుకు బాధిత కుటుంబీకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జొన్నాడ చిన్ని, గంటా ప్రసాద్, నేరేడుమిల్లి శ్రీను, కుంచే అర్జున్, దేవరపల్లి నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



ముమ్మిడివరంలో ప్రచార జాతా నిర్వహిస్తున్న కార్మికులు

ముమ్మిడివరం: మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ వర్కర్స్ ఫెడరేషన్ సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచార జాత శనివారం ముమ్మిడివరానికి చేరుకుంది. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు నగర పంచాయతీ కార్మికులు, ఉద్యోగుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జి.దుర్గా ప్రసాద్, పెట్టా శివ ప్రసాద్, అరుణ్‌కుమార్, ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతకు అండదలం

- రైతులకు వెన్నుదన్నుగా జగన్ ప్రభుత్వం
- ఆర్‌బీకేల ద్వారా సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు
- సత్ఫలితాలనిస్తున్న సాగు విప్లవం



విలసవిల్లిలో రైతులకు సేవలందిస్తున్న రైతు భరోసా కేంద్రం

ఉప్పలగుప్తం: నాడు టీడీపీ ప్రభుత్వంలో రైతులు వారి సమస్యలను చెప్పుకోవడానికి చెప్పులరిగేలా తిరిగినా పట్టించుకున్న నాథుడే కనపడలేదు. సాగు సమయంలో ప్రకృతి కరుణించి వర్షాలు పడినా పెట్టుబడి రుణాల కోసం రైతులు నానా అగచాట్లు పడేవారు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల కోసం వ్యయప్రయాలకు లోనయ్యేవారు. ఈ అడ్డంకులన్నింటినీ దాటినా ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికొచ్చేసరికి దళారులతో ఇక్కట్లు తప్పేవి కాదు. అంతేకాదు నాటి టీడీపీ ప్రభుత్వ పెద్దలు ఏకంగా వ్యవసాయం దండగని తేల్చేశారు. కాని వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక అన్నదాతలకు అడుగడుగునా అండగా నిలబడి వ్యవసాయమంటే నూరేళ్ల పండగగా మార్చి చూపించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీసుకొచ్చిన రైతు భరోసా కేంద్రాలతో కలుగుతున్న లబ్ధి చూసి అన్నదాతలంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆర్‌బీకేల ద్వారా సకల సేవలు

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఏ రైతు ఇబ్బందులకు లోనవ్వకుండా ప్రతి రెండు వేల మంది జనాభాకు ఒక రైతు భరోసా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దీంట్లో సాంకేతిక పరిజ్ఞానం కలిగిన సిబ్బందిని గ్రామ వ్యవసాయ సహాయకులుగా నియమించారు. స్థానికంగా రైతులకు ఏ సమస్య వచ్చిన సిబ్బంది చాకచాక్యంగా స్పందించి వెంటనే పరిష్కారమయ్యేలా చూస్తున్నారు. రైతులు వరి నాట్లు వేసేటప్పుడు విత్తన, మట్టి నాణ్యతను పరిశీలించి, సకాలంలో రైతు తీసుకునే చర్యలపై తగు సూచనలు ఇస్తున్నారు. రైతులకు అవగాహన పెరిగేలా పొలం బడి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రైతు భరోసా కేంద్రం ద్వారా విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు రాయితీపై అందిస్తున్నారు. రైతు పండించిన ధాన్యాన్ని ఆర్‌బీకేల ద్వారా కొనుగోలు చేసి 75 కిలోలకు రూ.1530 చొప్పున మద్దతు ధర అందించి దళారీ వ్యవస్థకు అడ్డుకట్ట వేశారు. రైతుకు సాగుకు ఉపయోగపడేలా యంత్ర పరికరాలు, డ్రోన్ స్ప్రేలు రాయితీపై అందిస్తున్నారు. రైతులకు పంట పెట్టుబడి కోసం రైతు భరోసాగా ఏటా రూ.13,500 నేరుగా వారి ఖాతాల్లోకి జమ చేస్తున్నారు. ఒక్క ఉప్పలగుప్తం మండలంలోనే 5,497 మంది రైతులకు నాలుగు దఫాలుగా రూ.13,500 ఐదో దఫాలో మొదటి విడతగా రూ.7500 జమ చేశారు. పంట నష్ట పరిహారం, ఈ-క్రాప్ ఇన్సూరెన్స్, సీసీఆర్‌సీ ద్వారా కౌలు రైతు భరోసాను జమ చేస్తున్నారు.

ఉప్పలగుప్తం మండలంలో..

మండల వ్యాప్తంగా 16 రైతు భరోసా కేంద్రాలు తాత్కాలిక భవనాల్లోనే సేవలందిస్తున్నాయి. అయితే వీటిని పూర్తి స్థాయిలో నిర్మించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వీటిలో భీమనపల్లి, ఉప్పలగుప్తం, గాడవిల్లి, గోపవరం గ్రామాల్లో భవనాలు పూర్తవగా మరో 12 భవనాలు నిర్మాణ దశలో ఉన్నాయి.

రైతు భరోసాతో ఎంతో మేలు



ఏటా రైతు భరోసాగా అందిస్తున్న సాయం నాట్లు, పెట్టుబడుల సమయాల్లో బాగా ఉపయోగపడుతుంది. ప్రభుత్వం నాకు ఇప్పటివరకూ రూ.61,500లు రైతు భరోసాగా జమ చేసింది. రైతులను సకాలంలో ఆదుకునే విధానం జగనన్న ప్రభుత్వంలోనే చూస్తున్నాం.

– మారిశెట్టి నరేష్, రైతు, వాడపర్రు, ఉప్పలగుప్తం మండలం

గతంలో నిలువు దోపిడీ చేసేవారు



గత ప్రభుత్వ హయాంలో పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర అందక తీవ్ర ఇబ్బందులు పడేవాళ్లం. దళారీలు నిలువుదోపిడీ చేసి బస్తాకు రూ.550 నుంచి రూ.800 మాత్రమే చెల్లించేవారు. ప్రస్తుతం ఆర్బీకేల ద్వారా మద్దతు ధర అందిస్తున్నారు. అంతేకాదు అకాల వర్షానికి మా చేను పనలపై ఉండి ధాన్యం పూర్తిగా తడిసింది. సమయానికి ఆర్‌బీకే ద్వారా కొనుగోలు చేసి మద్దతు ధర అందించారు.

– నలాది వెంకటేశ్వరరావు, రైతు, గొల్లివిల్లి,

ఆర్‌బీకేల ద్వారా రైతులకు మేలు



ప్రభుత్వం గ్రామ స్థాయిలో ఏర్పాటు చేసిన ఆర్‌బీకేల ద్వారా రైతులకు చాలా మేలు జరుగుతుంది. గతంలో వ్యవసాయం నిమిత్తం ఏ పని కావాలన్నా మండల కేంద్రానికి వచ్చి రైతులు ఇబ్బంది పడేవారు. ప్రస్తుతం గ్రామాల్లో వారికి అందుబాటులో ఆర్‌బీకేల ద్వారానే రైతుకు కావాల్సినవన్నీ సమకూరుతున్నాయి.

– జి.కుమార్‌బాబు, వ్యవసాయాధికారి

గడప గడపకూ సంక్షేమం

- మంత్రి విశ్వరూప్ తనయుడు శ్రీకాంత్
- ఎన్.కొత్తపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం



ఎన్.కొత్తపల్లిలో సంక్షేమ వివరాలను లబ్ధిదారుకు అందజేస్తున్న పినిపే శ్రీకాంత్

ఉప్పలగుప్తం: గడప గడపకూ సంక్షేమం అందేలా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ తనయుడు పినిపే శ్రీకాంత్ అన్నారు. మండలంలోని ఎన్.కొత్తపల్లి గ్రామంలోని సచివాలయం -2 పరిధిలో శనివారం స్థానిక నాయకులతో కలిసి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి గత నాలుగేళ్లుగా ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల్ని వివరించి సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వం ఇంటింటికీ ఏదొక పథకం ద్వారా లబ్ధి చేకూరుస్తుందని, రాబోయే కాలంలో ఈ పథకాలు కొనసాగాలంటే జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాలని వివరించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బద్రి బాబ్జి, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ చీకట్ల కిషోర్, సొసైటీ అధ్యక్షుడు నడింపల్లి వాసురాజు, పార్టీ నాయకులు బొడ్డు నాగేశ్వరరావు, అంగాని సాంబశివరావు, రాంబాబు, కోలా లక్ష్మణ్, కృష్ణ, కుంచే చిన్ని, దండు సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

ఒడిశా రైళ్ల ప్రమాద మృతులకు ఘన నివాళి



ఒడిశా రైళ్ల ప్రమాద మృతులకు కొవ్వొత్తుల ర్యాలీతో నివాళులర్పిస్తున్న చాంబర్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: ఒడిశా రాష్ట్రం బాలాసోర్ సమీపంలోని బహనాగా రైల్వేస్టేషన్ వద్ద జరిగిన ఘోర రైళ్ల ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన మృతులకు అమలాపురం చాంబర్ ఆఫ్ కామర్స్, వాకర్స్ హెల్త్ క్లబ్ తదితర సంస్థల ప్రతినిధులు శనివారం రాత్రి ఘన నివాళులర్పించారు. స్థానిక గడియారం స్తంభం సెంటరులో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించి రైళ్ల ప్రమాదంలో మృతి చెందినవారి ఆత్మలకు శాంతి చేకూరాలని, మృతుల కుటుంబాలకు ధైర్యం ఇవ్వాలని కోరుతూ కొవ్వొత్తుల ర్యాలీ సాగింది. పోలీసులు, ఓం శాంతి బ్రహ్మకుమారీలు కూడా ర్యాలీలో పాల్గొని నినాదాలు చేశారు. ఆర్మ్‌డ్ డీఎస్పీ పి.విజయసారథి, అమలాపురం రూరల్ సీఐ పి.వీరబాబు, మున్సిపల్ మాజీ చైర్మన్ చిక్కాల గణేష్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోణం సత్య వరప్రసాద్, వాకర్స్ హెల్త్ క్లబ్ అధ్యక్షుడు యర్రమిల్లి సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు మహిళలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు

ముమ్మిడివరం: కులం పేరుతో దూషించిన ఘటనలో ఇద్దరు మహిళలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కె.సురేష్‌బాబు తెలిపారు. ఆయన చెప్పిన వివరాల ప్రకారం కాట్రేనికోన మండలం పల్లంకుర్రు గ్రామానికి చెందిన జగడం సత్యనారాయణ ముమ్మిడివరం మండలం అయినాపురం పంచాయతీ చినమెట్ట లంకలో 60 సెంట్ల భూమిని మూడేళ్లకు లీజుకు తీసుకున్నాడు. గత నెల 28న కుంచే సత్యనారాయణ అనే కార్మికుడితో దింపు తీయిస్తున్నాడు. మట్టపర్తి పార్వతి, ఆమె కుమార్తె విజయ జానకిలు భూమిలోకి అక్రమంగా ప్రవేశించి తనను కులం పేరుతో దూషించి దింపు తీసిన కొబ్బరి కాయలు తీసుకుపోయారని కార్మికుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సురేష్‌బాబు తెలిపారు.

పాలిటెక్నిక్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

తాళ్లరేవు: ఆంధ్రప్రదేశ్‌లోని పైడా పాలిటెక్నిక్ కళాశాల పరిధిలోని 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి పశు సంవర్ధక, మత్స్యశాఖ, వ్యవసాయ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశం కొరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల చైర్మన్ పైడా సత్యప్రసాద్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఆయా కోర్సులకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇతర వివరాలకు 94926 10674 నెంబరులో సంప్రదించాలన్నారు.

చెస్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



రాష్ట్ర చెస్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విక్టరీ విద్యార్థులు

అమలాపురం రూరల్: తిరుపతి, నెల్లూరుల్లో జరిగిన రాష్ట్ర చెస్ చాంపియన్ షిప్ పోటీల్లో అమలాపురం విక్టరీ అకాడమి విద్యార్థులు తాడి వెంకటేష్, కేశనకుర్తి రాజేష్ ప్రతిభ కనబరిచి చెరో రూ.2 వేల రూపాయలు నగదు బహుమతి సాధించారు. పోటీల్లో రాజేష్ 1134 రేటింగ్ సాధించి రేటెడ్ ప్లేయర్‌గా నిలిచాడు. ఇటీవల నెల్లూరులో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ద్రాక్షారపు సాత్విక్ నాలుగో స్థానం సాధించి రూ.2 వేల బహుమతి పొందాడు. ఈ సందర్భంగా శనివారం విక్టరీ అకాడమీలో జరిగిన అభినందన సభలో ప్రిన్సిపాల్ తాడి వెంకట సురేష్, ఇన్‌చార్జి శ్రీదేవి వారిని అభినందించారు.

ప్రతి ఒక్కరూ విద్యావంతులు కావాలి



సోమిదేవరపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ముమ్మిడివరం: సమాజాభివృద్ధికి అక్షరాస్యతే మూలమని ప్రతి ఒక్కరూ విద్యావంతులు కావాలని కోరుతూ శనివారం ముమ్మిడివరం నగర పంచాయతీ శివారు సోమిదేవర పాలెంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మన్‌కీ బాత్ కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రాథమిక పాఠశాలలో అక్షరాస్యత, సంఖ్యాశాస్త్రం, నైపుణ్యాభివృద్ధి, జాతీయ విద్యావిధానం, ప్రాథమిక పాఠశాలల బలోపేతం అనే అంశాలపై విద్యార్థులకు, తల్లితండ్రులకు అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయుడు కె.రాము, పి.హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

నొప్పి మందులతో మహిళకు రియాక్షన్



చికిత్స పొందిన మహిళతో కిమ్స్ వైద్య బృందం

అమలాపురం రూరల్: పాశర్లపూడి లంక గ్రామానికి చెందిన 46 ఏళ్ల మహిళ మే నెల మొదటి వారంలో ఛాతీలో నొప్పితో స్థానిక వైద్యుల సలహా మేరకు మందులు వాడింది. అవి వికటించి రియాక్షన్ రావడంతో ఆమె శరీరంపై సుమారు ఏడు శాతం మేరకు నీటి బుగ్గలు ఏర్పడ్డాయి. చికిత్స కోసం అమలాపురం స్థానిక ఆసుపత్రుల్లో పది రోజులు ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో మే 18న కిమ్స్ హాస్పిటల్‌లో చేరింది. వైద్య పరీక్షలు జరిపి ఆమె చర్మం, రక్తం, మూత్ర విసర్జన వ్యవస్థలు ఇన్‌ఫెక్షన్‌కు గురయ్యాయని గుర్తించారు. కిమ్స్ చర్మ వ్యాధుల విభాగ వైద్యురాలు ఎస్.రామతులసి, వైద్యులు ఎంఏ రమీజ్ రాజా, మంజరి, సీహెచ్ అశోక్‌కుమార్, శరణ్యలతో కూడిన వైద్యబృందం 15 రోజుల పాటు చికిత్స చేసి ఆమె ప్రాణాలు కాపాడారు. రోగికి ఉన్న అలర్జీ వివరాలు పరిగణలోకి తీసుకోకుండా మందులు వాడడం వల్లే ఇటువంటి పరిణామాలకు దారి తీస్తుందని డాక్టర్ రామతులసి తెలిపారు.

రైల్వే రిజర్వేషన్ కౌంటర్‌కు మంగళం

- ఇక నుంచి హెడ్‌పోస్టాఫీస్ ద్వారా సేవలు
- నిర్ణయంపై సీనియర్ సిటిజన్స్ నుంచి వ్యతిరేకత
- కోనసీమకు రైలు వచ్చే వరకైనా ఉంచాలని వినతి



అమలాపురం సర్క్యులర్ బజార్‌లో ఉన్న రైల్వే రిజర్వేషన్ కౌంటర్ సెంటర్

అమలాపురం టౌన్: రైలు సౌకర్యం లేని కోనసీమ ప్రజలకు అమలాపురం సర్క్యులర్ బజారులో గత 23 ఏళ్లుగా రైల్వే శాఖ ద్వారా నిర్వహిస్తున్న రైల్వే రిజర్వేషన్ కౌంటర్ ఎత్తివేతకు ఆ శాఖ ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారు. అయితే రైల్వే రిజర్వేషన్ సేవలను అమలాపురం హెడ్ పోస్టాఫీసుకు బదలాయించారు. ఈ నెల 7వ తేదీ నుంచి హెడ్ పోస్టాఫీసులోనే రిజర్వేషన్లు జరగనున్నాయి. సర్క్యులర్ బజారులో మున్సిపల్ షాపుల్లో ఇన్నాళ్లు రైల్వే శాఖ నిర్వహిస్తున్న ఈ కౌంటర్‌ను ఈ నెల 6వ తేదీ నాటికి ఖాళీ చేయనున్నారు. ఈ మేరకు విజయవాడ డివిజనల్ రైల్వే మేనేజర్ (కమర్షియల్ బ్రాంచి)నుంచి ఈ నెల 1వ తేదీన లిఖిత పూర్వక ఉత్తర్వులు వెలువడ్డాయి.

ఎందుకు ఎత్తివేత నిర్ణయం..?

కోనసీమ ప్రాంతానికి రైలు మార్గం లేదు. 2000 సంవత్సరంలో అప్పటి లోక్‌సభ స్పీకర్ జీఎంసీ బాలయోగి రైల్వే రిజర్వేషన్ కౌంటర్‌ను ఏర్పాటు చేయించారు. అప్పటి నుంచి రెండు దశాబ్దాలకు పైగా రైల్వే టిక్కెట్ల రిజర్వేషన్లు ఆన్‌లైన్ విధానంలో బుకింగ్ చేసుకునే వెసులుబాటు కలిగింది. అయితే ఇటీవల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా అన్ని సేవలు ప్రజల ముంగిటకే అందిస్తున్న క్రమంలో రైల్వే రిజర్వేషన్ సౌకర్యం కూడా వీటి ద్వారా కల్పించారు. దీనికి తోడు దాదాపు 70 శాతం ప్రజలు రైల్వే రిజర్వేషన్ల ప్రక్రియను తమ స్మార్ట్ ఫోన్ల ద్వారా చేసుకుంటున్నారు. ఇదే సమయంలో పోస్టాఫీసుల ద్వారా పాస్‌పోర్టు తదితర అనేక సేవలు అందిస్తున్న క్రమంలో రైల్వే రిజర్వేషన్లను కూడా అందులోకి తెస్తోంది. ఇలా అందుబాటులోకి వచ్చిన రెండు వెసులుబాటులతో రైల్వే శాఖ అమలాపురంలో రిజర్వేషన్ కౌంటర్ ఎత్తివేతకు నిర్ణయం తీసుకున్నట్లుగా తెలుస్తుంది. గతేడాది ఈ కౌంటర్ ఎత్తివేతపై ఆ శాఖ నిర్ణయం తీసుకుంటే ప్రజల సౌకర్యార్థం అమలాపురం ఎంపీ చింతా అనురాధ ఆ నిర్ణయాన్ని అడ్డుకున్నారు. దీంతో అప్పటి నుంచి రైల్వే రిజర్వేషన్ సేవలు యధావిధిగా కొనసాగుతున్నాయి. మళ్లీ ఇప్పుడు కౌంటర్ ఎత్తివేసే నిర్ణయం తెరపైకి వచ్చింది.

రైల్వే లైన్ వచ్చే వరకైనా..

కోనసీమకు రైలు మార్గం ఎలాగూ లేదు. కోటిపల్లి-నర్సాపురం రైల్వే లైను కోనసీమ మీదుగా నిర్మితమయ్యేందుకు ఇప్పటికే మూడు నదులపై వంతెనల నిర్మాణాలు జరుగుతున్నాయి. కోనసీమకు కనీసం రైలు వచ్చే వరకైనా ఈ కౌంటర్‌ను కొనసాగించాలని ఆ ప్రాంత సీనియర్ సిటిజన్స్ విజ్ఞప్తి చేస్తున్నారు. రైల్వే శాఖ ద్వారా ఆదివారం కూడా సేవలు అందిస్తున్న ఈ కౌంటర్ హెడ్ పోస్టాఫీసుకు మారితే ఆ అవకాశం ఉండదని కోనసీమ రైల్వే సాధన సమితి అభిప్రాయపడుతోంది. సమితి ప్రతినిధులు ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, డాక్టర్ ఈఆర్ సుబ్రహ్మణ్యం, తదితరులు ఎంపీ అనురాధను కలిసి కౌంటర్ ఎత్తివేత నిర్ణయాన్ని ఆపించేందుకు ప్రయత్నిస్తున్నారు.

కౌంటర్ ఉండేలా ప్రయత్నిస్తాను

స్థానిక ప్రజలు, పలు సంస్థల అభ్యర్థన మేరకు అమలాపురంలో రిజర్వేషన్ కౌంటర్‌ను ఎత్తేయకుండా మరోసారి ప్రయత్నిస్తాను. రైల్వే శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడతాను. కోనసీమకు రైలు మార్గం వచ్చే వరకూ ఈ రిజర్వేషన్ కౌంటర్‌ను రైల్వే శాఖ ఆధ్వర్యంలోనే ఉంచితేనే మంచిది.

– చింతా అనురాధ, ఎంపీ, అమలాపురం

ఉద్యోగుల రిలే దీక్ష

రాజోలు: పలు డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ రాజోలు తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) ఆధ్వర్యాన శనివారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మద్దాల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమాన్ని జిల్లా అధ్యక్షుడు పి.సుబ్బారాయుడు ప్రారంభించారు. రాజోలు, మామిడికుదురు, మలికిపురం, సఖినేటిపల్లి మండలాలకు చెందిన వివిధ శాఖల ఉద్యోగ సంఘ నాయకులు దీక్షలో కూర్చున్నారు. ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు చెల్లించేలా చట్టం తీసుకురావాలని, ఓపీఎస్ పునరుద్ధరించాలని, పెన్షనర్లకు బకాయి పడిన ఆర్థిక ప్రయోజనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లా వీఆర్వో సంఘం నాయకుడు మద్దాల బాపూజీ తదితరులు పాల్గొన్నారు.

ధూమపానం వద్దు జీవితమే ముద్దు

అంబాజీపేట: ధూమపానం వద్దు-జీవితమే ముద్దు అని నేషనల్ టొబాకో కంట్రోల్ ప్రోగ్రాం సోషల్ వర్కర్ ప్రమీల అన్నారు. పొగాకు వ్యతిరేక దినోత్సవాల కార్యాచరణలో భాగంగా మాచవరం సచివాలయ-2 లో సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి అధ్యక్షతన పొగాకుపై సిబ్బందికి శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రమీల మాట్లాడుతూ పొగాకు వాడకం వలన వచ్చే అనర్థాలను ప్రజలకు వివరించాలన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

కొత్త రేషన్‌కార్డులకు దరఖాస్తులు

కొత్తపేట: రైస్ కార్డులేని అర్హులు గ్రామ సచివాలయాల ద్వారా ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకోవాలని ఆర్‌డీఓ ఎం.ముక్కంటి శనివారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ వారు ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులైన లబ్ధిదారులందరికీ అన్ని సంక్షేమ పథకాల ప్రయోజనం పొందడం కోసం సంక్షేమ క్యాలెండర్‌లోని సంవత్సరానికి రెండుసార్లు అనగా జూన్, డిసెంబర్ నెలల్లో కొత్త రైస్ కార్డులు అందచేయవలసి ఉందన్నారు. ప్రస్తుతం ఈ నెలలో అర్హులైన లబ్ధిదారులకు రైస్ కార్డులు అందచేయుటకు ప్రభుత్వ నియమ నిబంధనలు అనుసరించి అర్హులైన వారు, ముఖ్యంగా ఒంటరి వ్యక్తులు, ఆశ్రయం లేనివారు, సంచార కుటుంబాల లబ్ధిదారులు సచివాలయాల ద్వారా దరఖాస్తు చేసుకొనుటకు అవకాశం కల్పించినట్టు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సైకిల్‌తో కాలుష్య రహిత సమాజం

కొత్తపేట: సమాజంలో ప్రతి ఒక్కరూ సైకిల్ తొక్కడం ద్వారా ఆరోగ్యవంతులు కావాలని స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ పి.నిర్మలకుమారి సూచించారు. ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు శనివారం స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సైకిల్ ర్యాలీ, అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎస్.అరుణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సదస్సులో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ సైకిల్ తొక్కడం ద్వారా వారి ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు కాలుష్యరహిత సమాజానికి దోహదపడాలన్నారు. యోగా, మెడిటేషన్, సైకిల్ వ్యాయామం ద్వారా మనిషి ఆయుష్షు పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా వినియోగదారుల సంఘం కార్యదర్శి సత్తిరాజు ఆదిత్యకిరణ్, ఎస్టీయూ కార్యదర్శి వి.బాలకృష్ణ, యూత్ కోఆర్డినేటర్ ఎం.బాలు, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

కౌన్సిలర్ రాజేష్‌కు పరామర్శ



కౌన్సిలర్ రాజేష్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సతీష్‌కుమార్, ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

అమలాపురం టౌన్: మాతృ వియోగంతో బాధపడుతున్న 22వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్, వైఎస్సార్ సీపీ నాయకుడు గొవ్వాల రాజేష్‌ను జిల్లా పార్టీ అధ్యక్షుడు, ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్‌లు శనివారం పరామర్శించారు. కౌన్సిలర్ రాజేష్ తల్లి దివంగత సూరమ్మ చిత్రపటానికి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పరామర్శించినవారిలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, పార్టీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని, ఆదిత్య విద్యా సంస్థల అకడమిక్ డైరెక్టర్ పి.చలపతిరావు తదితరులున్నారు.


సియోచం క్రికెట్ టోర్నీ విజేత కేవీఆర్ జట్టు



సియోచం క్రికెట్ టోర్నీ కప్‌తో విజేత కేవీఆర్ జట్టు

యానాం: స్థానిక మెట్టకుర్రు ప్రభుత్వ హైస్కూల్‌లో పాండిచ్చేరి క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సియోచం క్రికెట్ టోర్నీ విజేతగా కేవీఆర్ జట్టు నిలిచింది. యానాం వైఎస్‌సీఏ నిర్వహణలో సుమారు 16 రోజులుగా జరుగుతున్న ఈ టోర్నమెంట్ శనివారంతో ముగిసింది. ఫైనల్‌లో రామా యూత్, కేవీఆర్ యూత్ జట్లు తలపడగా కేవీఆర్ జట్టు విజయం సాధించింది. మ్యాచ్‌లో అత్యధిక రన్స్ చేసిన కాచర్ల సునీల్‌కు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు లభించింది. ఈ ట్రోఫీని కేవీఆర్‌కు అంకితం చేస్తున్నట్లు జట్టు సభ్యులు తెలిపారు.

అమ్మవార్లకు చండీ హోమం



విలసవిల్లిలో చండీయాగం నిర్వహిస్తున్న పండితులు

ఉప్పలగుప్తం: మండలంలోని విలసవిల్లి గ్రామ దేవతలైన ముక్కులమ్మ, ముత్యాలమ్మ అమ్మవార్ల ఆలయాల వద్ద జ్యేష్ఠ పౌర్ణమి(ఏరువాక పౌర్ణమి) సందర్భంగా శనివారం పండితులు మున్సంగి రామకృష్ణ శర్మ ఆధ్వర్యంలో చండీయాగం నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.